మహిళలకు వరం.. వైఎస్సార్ చేయూత

- ఇప్పటివరకూ రూ 13.24 కోట్ల సాయం
- 3,082 మంది మహిళలకు లబ్ధి

ఏలూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ చేయూత పథకం గ్రామీణ మహిళల్లో ఆత్మ విశ్వాసం నింపింది. ఆర్థికంగా వెనకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కుటుంబాల్లో ఈ పథకం పెనుమార్పు తెచ్చింది. ఈ పథకం ద్వారా ఏటా రూ.18,750 చొప్పున ఒకొక్క మహిళ నాలుగేళ్లలో మొత్తంగా రూ.75 వేలు అందుకోనున్నారు. ఇప్పటి వరకూ 3 విడతల్లో మొత్తంగా ఒకొక్క మహిళ రూ 56,250 అందుకున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నాల్గోవ విడత నగదు ప్రభుత్వం త్వరలో విడుదల చేయనుంది. లబ్ధిదారుల్లో 60 ఏళ్లు పైబడిన వారు పథకం నుంచి నిష్క్రమించగా, 45 ఏళ్లు దాటిన వారు పథకానికి అర్హత సాధిస్తున్నారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహంతో లబ్ధిదారులు స్వయం స్వావలంబన వైపు అడుగులు వేస్తున్నారు. ఏలూరు రూరల్ మండల గ్రామాల్లోని 15 పంచాయతీల్లో మొత్తంగా 3,082 మంది మహిళలకు ప్రభుత్వం పథకం వర్తింప చేసింది. ఫలితంగా ఇప్పటి వరకూ అధికారులు రూ.13 కోట్ల 24 లక్షల 87 వేల 500 మహిళల ఖాతాల్లో జమ చేశారు.



మాదేపల్లిలో వైఎస్సార్ చేయూత పథకం అభినందన కార్యక్రమానికి హాజరైన మహిళలు (ఫైల్)

'చేయూత'తో మహిళల ఆర్థికాభివృద్ధి

గత ప్రభుత్వ హయాంలో రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు భర్త మాత్రమే పోషకుడు. ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పరిస్థితి మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మహిళల్లో ఆశక్తి రేపింది. ఇదే క్రమంలో ప్రతిపక్ష పార్టీలు అవహేళన చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది మహిళలకు పథకం అమలు చేయగలరా అని ప్రశ్నించాయి. సాధ్యం కాని హామీలతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారంటూ ఆరోపించాయి. కాని ఎన్నికలు అయిన కొద్ది నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానంటూ అనూహ్యంగా వైఎస్సార్ ఆసరా పేరుతో పథకం ప్రకటించారు. దీనిపై ఆర్థికంగా వెనకబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలు హర్షం వెలిబుచ్చారు. 45 ఏళ్లు దాటిన ప్రతి మహిళలకు పథకం వర్తింప చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 26 లక్షల మంది మహిళలకు 14 వేల కోట్ల రూపాయలు అందుకున్నారని ప్రభుత్వం వెల్లడించింది.

కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన వైఎస్సార్ చేయూత పథకం నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. ఈ పథకం ద్వారా మూడేళ్లలో రూ.50 వేలు అందుకున్నాను. ఈ మొత్తంతో నేను, నా భర్త చేపల వ్యాపారం చేపట్టాం. ఇప్పుడు మా పరిస్థితి ఎంతో మెరుగుపడింది. ఆర్థికంగా బలపడుతున్నామనే ధైర్యం వచ్చింది. సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– బలే పుల్లమ్మ, పెదయాగనమిల్లి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా నాలాంటి ఎందరో మహిళలకు ఏటా రూ.18,750 ఇస్తున్నారు. 45 ఏళ్లు దాటిన మహిళలు అందరికీ ఆర్థిక సహాయం చేయడం సాధ్యమేనని సీఎం నిరూపించారు. ఇప్పుడు అందరూ ఆశ్చర్యపోతున్నారు. ఈ పథకం మహిళలను కుటుంబంలో ఒక శక్తిగా మార్చింది.

వరద పార్వతి, వైఎస్సార్ కాలనీ

క్లుప్తంగా

120 మందికి వైద్య సేవలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ బీ కృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజలు ఆహారపు అలవాట్లు మార్చుకుంటే ఆరోగ్యకర జీవితం కొనసాగించవచ్చని కాకరాల వేణుబాబు సూచించారు. ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్, క్రీస్తు సంఘం, శ్రీ కృష్ణ హాస్పిటల్, ట్రస్ట్ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యానగర్ మనోరమా హోమ్స్ వెనుక క్రీస్తు సంఘం భవనములో ఆదివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.కృష్ణ, డాక్టర్ అభిలాష్, డాక్టర్ సువర్ణ ప్రత్యూష సుమారు 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీ సుబ్రహ్మణ్యం, ఆర్‌సీ శేషుకుమార్, వీజీఎంవీఆర్ కృష్ణారావు, పి.మురళీకృష్ణ, దిడ్ల ఆంజిలో తదితరులు పాల్గొన్నారు. అనంతరం 63 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

136 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య నిపుణులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామకోటి ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పరమహంస యోగానంద నేత్రవైద్యశాల వైద్యులు ఈశిబిరంలో పాల్గొని 136 మందికి కంటి పరీక్షలు చేశారు. 17 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి శస్త్రచికిత్సలు చేయడానికి ఏర్పాటు చేశారు. అలాగే 32 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానేపల్లి రామారావు, బొలిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. గన్నవరం మండలం కేసరపల్లికి చెందిన జాస్తి మధు కల్యాణ్ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాత కుటుంబానికి ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి



ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అలీనోద్యమ నాయకురాలిగా, ఉక్కు మహిళగా ప్రపంచ దేశాల్లో భారత కీర్తిపతాకాన్ని ఎగురవేసిన మహిళా నేత ఇందిరా గాంధీ అని ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అన్నారు. దేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ 106వ జయంతి కార్యక్రమం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రామ్మోహనరావు మాట్లాడుతూ దేశంలో బ్యాంకులను జాతీయాకరణ చేసి సామాన్యులను సైతం బ్యాంక్ మెట్లు ఎక్కించిన ఘనత ఇందిరా గాంధీకే దక్కుతుందన్నారు. తొలుత ఇందిరా గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు గాతు సత్యేంద్ర, గాడ రంగబాబు, సాదే బాబు ప్రసాద్, నలగట్ల అనిల్, కొమ్మన సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల వనభోజన మహోత్సవానికి తరలివెళ్లిన నాయకులు



మంత్రి వనితను సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): విజయవాడలోని కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ మాదిగల వనభోజన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరైనట్లు జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం సాయంత్రం ఏలూరులో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హోంమంత్రి తానేటి వనిత, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్సీలు కరుణ్‌కుమార్, బొమ్మి ఇజ్రాయేల్, లిడ్ క్యాప్ చైర్మన్ కె.రాజశేఖర్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితర మాదిగ పెద్దలు హాజరైనట్లు చెప్పారు. మాదిగల వనభోజన మహోత్సవం విజయవంతం చేసేందుకు సహాకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోంమంత్రి తానేటి వనితను దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు, పాలకుర్తి రమేష్, భోధన శ్రీనివాసరావు, ప్రేమ్ కుమార్, మార్క్ గజమాలతో సత్కరించినట్లు తెలిపారు.

సమాజానికి మేలు చేసే కవితలు రచించాలి



రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మిని సన్మానిస్తున్న శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కవులు సమాజానికి మేలు చేసే విధంగా ఉత్తమ కవితలు రచనలు చేయాలని, సమాజంలోని పరిస్థితులపై పూర్తి అవగాహనతో ఉండాలని, అక్షరాన్ని ఆయుధంగా మార్చుకొని మంచి రచనలు చేయాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడ మాకినేని పున్నయ్య భవనంలో జరిగిన శ్రీశ్రీ కళావేదిక 125వ శతాధిక కవి సమ్మేళన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు ఏలూరులో పత్రికలకు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి మాట్లాడుతూ కవులను ప్రోత్సహించే విధంగా ఎన్నో కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకున్న శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తి మండ ప్రతాప్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఇటువంటి సమ్మేళనాల ద్వారా తమ సాహిత్య ప్రతిభను మెరుగులు దిద్దుకునే అవకాశం వర్ధమాన కవులకు కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కవులకు, కళాకారులకు పెద్దపీట వేస్తూ వైఎస్సార్ జయంతి సందర్భంగా ప్రతి ఏటా వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ద్వారా రూ. పది లక్షల నగదు ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మిని శ్రీశ్రీ కళావేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, బోయి భీమన్న అవార్డు గ్రహీత శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు కొల్లి రమావతి ఈశ్వరి, వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కవులు కళాకారులు పాల్గొన్నారు.

జనవరి 5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు



అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఏలూరు నియోజకవర్గ కమిటీకి ఎన్నికైన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వచ్చే ఏడాది జనవరి 5వ తేదీ నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు నిర్వహించనున్నట్లు ప్రముఖ గజల్ కళాకారుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్ర సారస్వత పరిషత్ సంఘం ఆధ్వర్యంలో 2వ అంతర్జాతీయ తెలుగు మహా సభలకు సన్నాహాక సమావేశాన్ని ఆదివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాస్ట్రో గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాజరాజ నరేంద్రునికి, నన్నయ్యకు అంకితంగా రాజమహేంద్రవరంలో వచ్చే జనవరి 5, 6, 7, తేదీల్లో 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభలను నిర్వహించడానికి నిర్ణయించామన్నారు. తెలుగు భాషను రాబోయే తరాల్లో తల్లి ఒడి భాషగా నిలిపే లక్ష్యంగా, ఆంధ్ర మేవ జయతే అని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పేందుకు ఈ ప్రపంచ తెలుగు మహా సభలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మార్గాని శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు తల్లి పండుగగా జరిగే ఈ మహాసభల్లో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అందరూ పాల్గొనాలని కోరారు. మూడవ పట్టణ సీఐ కె.శివాజీ మాట్లాడుతూ తెలుగు భాష మాతృభాష మాత్రమే కాదని, అమృత భాష అని అన్నారు. అంతర్జాతీయ తెలుగు మహాసభల సన్నాహాలకు గాను నియోజకవర్గస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశారు. ఏలూరు నియోజకవర్గానికి మార్గాని నాగ శ్రీకాంత్‌ను కన్వీనర్‌గా, నాగా, పీ.వెంకటేశ్వరావులను కో–కన్వీనర్‌లుగా, కస్తూరీ రావు, టి.గిరిరాజ్, వై.ఆనంద నాయుడు, కె.శ్రీనివాసరావు, సీహెచ్ సురేందర్, రమణ, మానేపల్లి రామారావులను సభ్యులుగా నియమించి గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు.

మహిళల భద్రత కోసమే 'దిశ' యాప్



సదస్సులో మాట్లాడుతున్న దిశ ఎస్సై కాంతిప్రియ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళల భద్రత కోసమే దిశ చట్టం అమలులో ఉన్నదని, కాబట్టి విద్యార్థినులు, మహిళలు దిశ యాప్‌ను తమ మొబైల్ ఫోనుల్లో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏలూరు నగర దిశ చట్టం ఎస్సై వి.కాంతిప్రియ చెప్పారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం సెయింట్ ఆన్స్ కళాశాల, సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల విద్యార్థినులకు దిశ చట్టం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్సై కాంతిప్రియ మాట్లాడుతూ దిశ చట్టంలోని సెక్షన్‌లను విద్యార్థులకు వివరించారు. విద్యార్థినిలకు ఏ అవసరం వచ్చిన ముందుగా 100 డయల్ చేస్తారని, ఇప్పుడు 112కు కూడా డయల్ చేయవచ్చు అని చెప్పారు. మహిళల రక్షణ కోసం 1100 నంబర్‌కు డయల్ చేస్తే ప్రభుత్వం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత నుంచి ఉదయం 5 గంటల వరకు ఒక మహిళ కానిస్టేబుల్‌ను, ఒక పురుష కానిస్టేబుల్‌ను ఇచ్చి వాహనంలో వారి ఇంటి వద్ద దిగబెట్టే సదుపాయం కల్పిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. దిశ చట్టంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు జరిపారు. ఉపాధ్యాయురాలు జీ నీలిమ, డీ శ్రీవల్లి, చలసాని సురేంద్ర, డిప్యూటీ లైబ్రేరియన్ ఏ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, బీ.రమేష్, ఎండీ.అస్లాం పాషా, కే.నాగరోజా మణి, బీవీ లక్ష్మి పాల్గొన్నారు.

బీటీఏ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణస్వీకారం చేస్తున్న బీటీఏ నూతన కార్యవర్గ సభ్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. తొలుత స్థానిక అంబికా థియేటర్ వద్దనున్న కృప వెల్‌నెస్ సెంటర్‌లో బీటీఏ జిల్లా కౌన్సిల్ నిర్వహించారు. ఈ సమావేశానికి బీటీఏ జిల్లా అధ్యక్షుడు సాయిరాజు భల్లం అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు బీ.మనోజ్ కుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పీ.సాల్మన్ హాజరై రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఏలూరు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా గుడిమెల్లి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా చేడే ధర్మలింగం, కోశాధికారిగా గుండె వెంకటరమణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బండవల్లి గిరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బర్మావతు రాంబాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా కాటంరాజు, అడిషనల్ జనరల్ సెక్రటరీగా వుండి కృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొల్లిపో కృపాకరణ్, ఆడిట్ సెక్రటరీగా అలుగుల సాయిరాజు, ప్రచార కార్యదర్శిగా పోలిమెట్ల శ్రీనివాసరావు, మహిళా కార్యదర్శులుగా వాసే ధనకాంత, బి.వరలక్ష్మి, కేఎస్ఎల్‌వీ లోవకుమారి, గౌరవాధ్యక్షులుగా ఎం.ఆనందరాజు, ద్రోణాదుల శ్రీనివాస్, కేడీ సమర్పణరావు, రాష్ట్ర కౌన్సిలర్స్‌గా పీ.సాల్మన్, బీ. మనోజ్ కుమార్, బి. రామారావు, బీహెచ్‌పీ సాయిరాజు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా మనోజ్ కుమార్, ఎన్నికల పరిశీలకులుగా సాల్మన్ వ్యవహరించారు.

హిందూ ఆలయాలను కుటుంబాలతో సహా దర్శించండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల కాలంలో హిందువులు హిందూ దేవాలయాలకు కుటుంబాలతో వెళ్లడం లేదని, రానురాను హిందువుల్లో ఐకమత్యం సన్నగిల్లుతున్న నేపథ్యంలో హిందువులు కుటుంబ సభ్యులతో సహా ఆలయాలను దర్శించాలని భువనేశ్వరి పీఠం స్వామీజీ శ్రీ కమలానంద భారతి జీ పిలుపునిచ్చారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గీతామందిర్‌లో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్వామీజీ మాట్లాడుతూ హిందువులను ఏకం చేయడం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా సమరసతా సేవా ఫౌండేషన్ వారు సమ్మేళనాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మతమార్పిడిలను నిరోధించడమే ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని, హిందువులలో భక్తి భావాలను పెంపొందించి తిరిగి స్వధర్మం ఆచరించాలని స్వామీజీ సూచించారు. తొలుత నగరవీధుల్లో 200 మందితో నగర సంకీర్తనలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర కార్యదర్శి కేఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా సహ కన్వీనర్ ధనెంకుల గోపాలకృష్ణ, నగర కన్వీనర్ ప్రసాద్, దేవాలయాల కన్వీనర్ రాంబాబు పాల్గొన్నారు.

ఆరు అంగుళాల సైజులో చెక్కతో వరల్డ్‌కప్



క్రికెట్ వరల్డ్ కప్ నమూనా తయారుచేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్): దేశమంతా క్రికెట్ ఫీవర్‌తో తలమునకలైన వేళ ఏలూరు శనివారపుపేటకు చెందిన సూక్ష్మ కళాకారుడు దొర శివప్రసాద్ ఆరు అంగుళాల ఎత్తు ఉండే విధంగా చెక్కతో వరల్డ్ కప్‌ను రూపొందించి అబ్బుర పరిచాడు. దీన్ని తయారు చేయటానికి తనకు గంటకు పైగా సమయం పట్టినట్లు శివప్రసాద్ చెప్పారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ భారత్ వరల్డ్ కప్‌ను గెలవాలని ఆకాంక్షిస్తున్న వేళ తాను సైతం తనకు తెలిసిన సూక్ష్మ కళతో దీన్ని రూపొందించినట్లు వివరించాడు. ఈ సందర్భంగా శివప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07–10
బెండకాయలు	36	కంద	60
పచ్చిమిర్చి	32	బీట్‌రూట్	40
కాకర కాయలు	28–32	కీరా దోస	48
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	98
బీరకాయలు (పందిరి)	48	అల్లం	120
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	44–48	పాలకూర	10
దొండకాయలు	22	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	46–55	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	18	బఠాణి	--
అనపకాయ (1)	15–20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15–20	చిలకదదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4822	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	09
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	32